

పోలీస్‌స్టేషన్‌కు కంప్యూటర్‌, ప్రింటర్‌ అందజేత

ప్రజాశక్తి-కడియం

మండలంలో వేమగిరి శ్రీ సర్వారాయ షుగర్‌ బాటిలింగ్‌ యూనిట్‌ సామాజిక బాధ్యతలో భాగంగా కడియం పోలీస్‌ స్టేషన్‌కు రూ.70 వేల విలువ చేసే కంప్యూటర్‌, ప్రింటర్‌ను శనివారం అందించింది. ఈ సందర్భంగా సిఐ అల్లు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్వారాయ షుగర్స్‌ ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం తోపాటు సిఎస్‌ఆర్‌ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. స్టేషన్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉండే కంప్యూటర్‌ పరికరాలు తాను అడిగిన వెంటనే సంస్థ ప్రతినిధులు స్పందించి సమకూర్చడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సిఎఫ్‌ఒ కె.శ్రీధర్‌, హెచ్‌ఆర్‌ మేనేజర్‌ కె.కృష్ణమూర్తి, అసిస్టెంట్‌ హెచ్‌ఆర్‌ మేనేజర్‌ డి.సతీష్‌ బాబు పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.

అర్ధాకలితో మిడ్డే మీల్స్‌ కార్మికులు

- పెరిగిన ధరలకు అనుగుణంగా పెరగని బడ్జెట్‌
- అమలుకు నోచుకోని కనీస వేతనం
- రెండు నెలలుగా బిల్లుల బకాయిలు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యార్థుల ఆకలిని తీర్చే మిడ్డే మీల్స్‌ కార్మికులకు మాత్రం అర్ధాకలితోనే జీవితాలను వెళ్లదీస్తున్నారు. కనీస వేతనాలు అమలుకాకపోవడం, బిల్లులు సకాలంలో విడుదల చేయకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందనే తలంపుతో భారంగానే బతుకును ఈడుస్తున్నారు. పాలకులు మారుతున్నా కొత్త ప్రభుత్వాలు వస్తున్నా వీరి సమస్యలు మాత్రం ఎక్కడివేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉన్నాయి.

జిల్లాలో 980 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మిడ్డేమీల్స్‌ కార్మికులు వండి పెడుతున్నారు. వీటిలో 706 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 189 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి వండి పెట్టడానికి అవసరమైన నూనె, పోపు గింజలు, పప్పు, ఉప్పు, చింతపండు, కూరగాయలు, వంట చెరకు తదితర సామగ్రి కోసం రూ.6, హైస్కూల్‌ విద్యార్థులకు రూ.9 ప్రభుత్వం చెల్లిస్తోంది. కనీసం ప్రాథమిక పాఠశాలలో రూ.10, హై స్కూల్‌ విద్యార్థులకు రూ.20 చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో మూడు రోజుల పాటు ఉడకబెట్టిన కోడిగుడ్డును భోజనంలో వేయాల్సి ఉంది. రాగి జావ పంపిణీకి అదనపు అలవెన్సులను చెల్లించటంలేదు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా ఒక్కో విద్యార్థి కోసం ఇచ్చే నగదును మాత్రం పెంచడం లేదు. సబ్సిడీపై వంటగ్యాస్‌ అందించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పెడ చెవిన పెడుతోంది.

రాజకీయ జోక్యంతో ఇబ్బందులు

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు పరిపాటిగా మారాయి.కార్మికుల అక్రమ తొలగింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులకు గురి చేయడం సర్వసాధారణంగా మారాయి. నాణ్యత తగ్గినా, కూరలు, పప్పులు సరిపోయినంత ఇవ్వకున్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక స్థాయి పిల్లలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం వంద గ్రాముల బియ్యం ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల పిల్లలు అల్పాహారం తీసుకునే అలవాటు లేకపోవడం అందుకు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న వంద, 150 గ్రాముల బియ్యం సరిపోవట్లేదు. అదనంగా ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు అక్కడే భోజనం చేయడం ఫలితంగా కొన్నిచోట్ల భోజనం సరిపోవడం లేదు. ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన బియ్యం సరఫరా చేస్తున్నా హమాలీ ఛార్జీలు మధ్యాహ్న భోజన కార్మికులే భరించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే మెస్‌ బిల్లుతో నాణ్యత విషయంలో రాజీ పడలేక ఇంటి నుంచి అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు.

2 నెలలుగా బకాయిలు

జిల్లాలో 2 నెలలుగా కార్మికులకు బిల్లుల బకాయిలు చెల్లించాల్సి ఉంది. రెండు నెలలుగా సొంత ఖర్చులతోనే కార్మికులు విద్యార్థులకు వండిపెడుతున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రభుత్వం గ్యాస్‌ సరఫరా చేయాలని, మెస్‌ ఛార్జీలు కాకుండా వంట సరుకులు కూడా సరఫరా చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. కట్టెల పొయ్యిపైనే వంట చేయడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికుల్లో అత్యధిక మంది అస్తమా, ఎలర్జీలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రభుత్వం వంట గ్యాస్‌ సబ్సిడీపై సరఫరా చేయాలని కోరుతున్నారు. ప్రతి నెలా మండల విద్యాధికారి జిల్లా అధికారులకు బిల్లును పంపగా అక్కడ నుంచి రాష్ట్ర ఫైనాన్స్‌ విభాగానికి వెళ్తాయి. నిధుల లభ్యతనుబట్టి మూడు, నాలుగు నెలలకొకసారి ఫైనాన్స్‌ క్లియరెన్స్‌ డబ్బు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాన్ని పెంచడంతో పాటుగా సరుకుల చార్జీలను పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

కనీస వేతనం చెల్లించాలి

25 సంవత్సరాలుగా ఈ పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండి పెడుతున్నాను. దీనికి గాను కార్మికులకు నెలకు రూ.3 వేలు మాత్రమే చెల్లించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయి. మరోవైపు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం చెల్లించే ధరలకు మార్కెట్‌లో సరుకులు రావడం లేదు. నెలల తరబడి బకాయిలు నిలిపివేయడంతో సొంత డబ్బులు పెట్టాల్సి వస్తుంది. లేదా అప్పులు చేయాల్సి వస్తుంది. కట్టెల పొయ్యి వాడకం ఫలితంగా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నాం. నిత్యావసర సరుకులు, గ్యాస్‌ ప్రభుత్వం పంపిణీ చేయాలి. కనీస వేతనం అమలు చేయాలి.

- ఎల్‌ఆర్‌.ఈశ్వరి, మధ్యాహ్న భోజన కార్మికురాలు, సీతానగరం మండలం



ధర్నా చేస్తున్న ఆయాలు

కనీస వేతనం కోసం ఆయాల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలంటూ రాజమహేంద్రవరం మునిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయం వద్ద మున్సిపల్‌ స్కూలు ఆయాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శాంతి, వై.ఝాన్సీ ఆధ్వర్యంలో శనివారం ఆయాలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు మాట్లాడారు. 25 ఏళ్లకు పైగా మున్సిపల్‌ స్కూల్లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆయాలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి నెలకు రూ.4వేలు మాత్రమే వేతనం ఇవ్వడం దారుణమన్నారు. ఈ జీతం కనీసం వారి ఇంటి అద్దెకు గానీ కరెంటు బిల్లుకు గాని సరిపోతుందా? అని ప్రశ్నించారు. స్కూల్‌ ఆయాలను పార్ట్‌ టైం కంటిన్జెంట్‌ వర్కర్‌గా నిర్ణయించి ఉదయం ఉంది సాయంత్రం వరకు పని చేయిస్తున్నారన్నారు. ఫుల్‌ టైం వర్కర్‌గా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని, అధికారుల బెదిరింపులు ఆపాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వంతల రాంబాబు, మున్సిపల్‌ స్కూల్‌ ఆయాల సంఘం సభ్యులు పి.సత్యవతి, ఎం.మంగతాయారు, ఎన్‌.సత్యవేణి, భాగ్యలక్ష్మి, పి.చిన్ని, బి.లక్ష్మి, జి.సోమాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్స్‌ విధులు కీలకం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్‌

ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల విధులు చాలా కీలకమని కలెక్టర్‌ పి.ప్రశాంతి అన్నారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్స్‌ శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి కలెక్టర్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రాడ్యుయేట్‌ ఎంఎల్‌సి ఎన్నికల కోసం నియమించిన పరిశీలకులు మూడు నాలుగు జిల్లాల్లో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని చోట్లా తిరిగి పర్యవేక్షించడం సాధ్యం కాదన్నారు. వారి తరపున మైక్రో అబ్జర్వర్లు విధులను నిర్వహిస్తూ ఎక్కడైనా కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ ఉల్లంఘనలు జరిగినా వెంటనే గుర్తించి దానికి సంబంధించిన సమాచారాన్ని సీల్డ్‌ కవర్లో పెట్టి సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల కమిషన్‌ నిర్దేశించిన నిబంధనలపై మాస్టర్‌ ట్రైనర్స్‌ అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణలో భాగంగా అందజేసిన మెటీరియల్‌ను క్షుణ్ణంగా పునశ్చరణ చేసుకోవాలని తెలిపారు. ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం ఆర్‌డిఒ ఆర్‌.కృష్ణనాయక్‌, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్‌ కె.భాస్కర్‌రెడ్డి, మాస్టర్‌ ట్రైనర్లు రవీంద్ర, త్రినాథ్‌ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్కౌట్‌ విద్యార్థులతో దాతలు

సమాజసేవే స్కౌట్‌ ధ్యేయం

ప్రజాశక్తి - కడియం

సమాజ సేవే స్కౌట్‌ ధ్యేయమని కడియం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.సత్యనారాయణ అన్నారు. విద్యార్థులకు 10 జతల స్కౌట్‌ యూనిఫామ్‌ను పల్ల వెంకన్న చారిటబుల్‌ ట్రస్ట్‌ తరపున శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. పిఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్‌ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో పనిచేస్తున్న గొల్లపల్లి సత్యనారాయణ, బి.గిరిజ ఇటీవల స్కౌట్‌ శిక్షణ తీసుకున్నారన్నారు. పాఠశాలలో స్కౌట్‌ అండ్‌ గైడ్‌ ఏర్పాటు చేశామన్నారు. తాము అడిగిన వెంటనే రూ.10 వేలను ట్రస్ట్‌ చైర్మన్‌ పల్ల వీరవెంకటసత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గణపతి యూనిఫామ్‌ నిమిత్తం ఇచ్చారని స్కౌట్‌ ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ తెలిపారు. ట్రస్ట్‌ సభ్యులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావాన్ని కలిగి ఉండాలన్నారు. చదవుతో పాటూ సామాజిక స్పృహను కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు పల్ల వినయ్‌, గైడ్‌ టీచర్‌ బి.గిరిజ, గైడ్‌ సహాయకురాలు వై.వీరరాఘవకుమారి, డేవిడ్‌ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో సిబ్బంది, విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

రాజమహేంద్రవరం రూరల్‌ కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వచ్ఛంద్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెసి చిన్నరాముడు పాల్గొన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కలెక్టరేట్‌ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఒక మంచి ఉద్దేశ్యంతో అధికారులను, సిబ్బందిని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇదే స్ఫూర్తితో కార్యాలయాల్లో పెండింగ్‌ ఫైల్స్‌ పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతమణి, సిపిఒ ఎల్‌.అప్పలకొండ, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, కలెక్టరేట్‌ ఎఒ ఎమ్‌డి ఆలీ, సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వైటిసి ఆవరణలో క్లీన్‌ అండ్‌ గ్రీన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి శాంతమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్‌ కళాశాలలో ప్రిన్సిపల్‌ డాక్టర్‌ రామచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల పరిసరాల్లో చెత్తను శుభ్రం చేశారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భగా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్‌ ఎస్‌.శోభారాణి, వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ మూర్తి తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలో పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవరణలను శుభ్రపరిచారు. సత్యవాడలో పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు గ్రామంలో వీధి వీధి తిరుగుతూ స్వయంగా మైకులో గ్రామ ప్రజలకు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. **దేవరపల్లి** స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్‌ కార్యక్రమంలో భాగంగా దేవరపల్లి మండలం పరిషత్‌ కార్యాలయంలో ఎంపిపి కెవికె.దుర్గారావు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. చెత్త నుంచి సంపద తయారుచేసే కేంద్రం వద్ద పంచాయితీ కార్యదర్శి ఎన్‌.రవికిశోర్‌ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. **తాళ్లపూడి** అన్నదాన పేటలో శనివారం సాలిడ్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ షెడ్డు వద్ద తుప్పలను తొలగించారు. స్కూలు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తడి-పొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎఇ నూర్జహాన్‌, ఎపిఒ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాస్‌ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరిశుభ్రత, పచ్చదనంపై ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కలెక్టరేట్‌ సిబ్బంది



ఆర్‌ఐఒకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఫీజుల పేర ఒత్తిడి తగదు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పరీక్షల పేరుతో కార్పొరేట్‌, ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని, ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిఎస్‌ఇఒ వాసుదేవరావు, ఇంటర్మీడియట్‌ ఆర్‌ఐఒ నరసింహరావులకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శనివారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్‌, ఎన్‌.రాజా మాట్లాడారు. కార్పొరేట్‌, ప్రయివేటు పాఠశాలలు సమయాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నాయన్నారు. ఉదయం 6:30 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పాఠశాలలు, కళాశాలలు నడుస్తున్నాయన్నారు. పరీక్షలు దగ్గరికి వస్తున్నాయనే పేరుతో విద్యార్థులపై అధిక ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఫీజు కట్టని వారికి పరీక్ష హాల్‌ టికెట్లు ఇవ్వబోమంటూ బెదిరింపులకు దిగుతున్నాయన్నారు. ఇలాంటి యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డిఇఒ వాసుదేవరావు మాట్లాడుతూ ఇలాంటి సమస్యలు ఏమైనా వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయక కార్యదర్శి కనక, ఉపాధ్యక్షులు కె.జ్యోతి, నగర కమిటీ సభ్యులు నాగ చైతన్య, తేజ, జోసెఫ్‌, కార్తీక్‌, మనోజ్‌, కుమార్‌ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గోకవరం మండలంలోని అచ్చుతాపురంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను కలెక్టర్‌ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం గ్రామంలో ఆమె పర్యటించారు. డ్రెయినేజీలు వేయడానికి వీలులేని రోడ్లు పక్కన ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటి కోసం ఉపాధి హామీ ద్వారా రూ.6వేలు చెల్లిస్తారన్నారు. జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌ ఎ.నాగమహేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ఇప్పటివరకు మంజూరైన 729 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.గోవింద్‌, తహశీల్దార్‌ సాయిప్రసాద్‌, ఇఒపిఆర్‌డి రాజేశ్వరరావు, ఎపిఒ పిఎస్‌.అప్పలరాజు, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

గ్రామాల్లో రీ సర్వే జరుగుతున్న సమయంలో ఆయా భూములకు సంబంధించిన రైతులు పాల్గొని సహకరించాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్‌ భారతి కోరారు. కుకునూరు డి పాపులేటెడ్‌ గ్రామంగా ఉన్న వీరభద్రపురం పరిధిలో జరుగుతున్న రీ సర్వేలో రికార్డుల ప్రకారం 467 ఎకరాలు భూములు ఉన్నాయన్నారు. వీటిలో సుమారు 400 ఎకరాలకి సంబంధించిన రైతులు సర్వేలో పాల్గొన్నారని భారతి తెలిపారు. వివిధ గ్రామాల్లో ఉంటున్న మిగిలిన ఎకరాలకు సంబంధించిన రైతులు సర్వే ముగిసిన తర్వాత ఇబ్బందులు ఎదుర్కోవడం కంటే ముందుగా సర్వేలో పాల్గొనాలని సూచించారు. సచివాలయ అసిస్టెంట్లు, లేదా విఆర్‌ఒలను కలిసి సమచారం తెలుసుకోవచ్చని తహశీల్దార్‌ సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌ వెంట గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు ఉన్నారు.


కానిస్టేబుల్‌ ప్రవీణ్‌ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్‌



గుండెపోటుతో కానిస్టేబుల్‌ వానపల్లి ఆదిత్యప్రవీణ్‌(37) శుక్రవారం మర ణించారు. ఆదిత్యప్రవీణ్‌ పోలీస్‌ శాఖలో 13 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ట్రాఫిక్‌ విభాగంలో కానిస్టేబుల్‌గా ఉన్నారు. శుక్రవారం గుండెపోటుకు గురయ్యాడు. హుటా హుటిన 108లో అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసు శాఖలో నిజాయతీ పరునిగా ప్రవీణ్‌ పేరు సంపాదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అధికారులు ప్రవీణ్‌ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసు లాంఛనాలతో ఆయనకు ధవళేశ్వరంలోని క్రైస్తవ శ్మశాన వాటికలో అంత్యక్రియలను శనివారం నిర్వహించారు. డిపార్ట్‌మెంట్‌లో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నాడని, నీతి, నిజాయతీ కలిగి నిబద్ధత ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాడని, చిన్న వయసులో ప్రవీణ్‌ మరణించడం చాలా బాధాకరమని తోటి సిబ్బంది అన్నారు. పోలీస్‌ డిపార్ట్‌మెంట్‌ ప్రవీణ్‌ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఎప్పుడు నవ్వుతూ అందరితో మంచిగా ఉండే ప్రవీణ్‌ లేకపోవడం తట్టుకోలేకపోతున్నామని స్నేహితులు కంటతడి పెట్టుకున్నారు.

కార్టూ'నిజం'



'మలా' విక్రయశాల ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



విక్రయ శాలను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ ప్రశాంతి

పులుగుర్త హ్యాండ్లూమ్‌ వీవర్స్‌ కో-ఆపరేటివ్‌ సొసైటీ ద్వారా ఉత్పత్తి చేసిన మలా చేనేత వస్త్రాల విక్రయాలను ప్రజలకు అందుబాటులోనికి తీసుకొచ్చామని కలెక్టర్‌ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక అన్నపూర్ణమ్మ పేటలోని నేత బజార్‌లో ఈ విక్రయశాలను ట్రస్ట్‌ చైర్మన్‌, వ్యవస్థాపకురాలు హుసురమ్మతో కలిసి కలెక్టర్‌ ప్రారం భించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ పి.ప్రశాంతి మాట్లా డుతూ మలా నూలుతో తయారు చేసిన వస్త్రాలు పర్యా వరణ అనుకూల ఉత్పత్తి ప్రక్రియకు ప్రసిద్ధి చెందిందన్నారు. మలా బ్రాండ్‌ సంప్రదాయ నేత పద్ధతులను, చేనేత వస్త్రాలతో ముడిపడి ఉన్న సాంస్కతిక, వారసత్వాన్ని కలిగి ఉందన్నారు. ఇటువంటి ప్రత్యేక గుర్తింపు కలిగిన చేనేత వస్త్రాలను కాపాడుకోవడం అందరి కర్తవ్యమన్నారు. పులుగుర్త చేనేత పరిశ్రమకు దీర్ఘకాలంగా నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులు ఉన్నారన్నారు. వీరి ఉత్పత్తులు దేశీయంగా, అంతర్జాతీయంగా వినియోగదారులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. యూరోపియన్‌ దేశాల్లో 'మలా' పులుగుర్త చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్‌ ఉందన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఈ విక్రయశాలను సందర్శిం చాలన్నారు. చీరలు, చుడిదార్‌ మెటీరియల్‌, పంచెలు, షార్ట్స్‌ ఇతర వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ డిడి పి.పెద్దిరాజు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్‌.మూర్తి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ భాస్కర్‌, ఎడిఒలు శ్రీదేవి, వెంకటేశ్వరరావు, గురురాజు, మల్కా షాప్‌ మేనేజర్‌ డివివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బిసిలకు సర్కారు 'ఆదరణ'

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

బిసిలకు కూటమి ప్రభుత్వం 'ఆదరణ' పథకాన్ని అమలు చేస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్‌ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెనకబడిన తరగతుల కులవృత్తులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఆదరణ పథకాన్ని ఆదరణ-3 పేరిట పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదరణ పథకాన్ని గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. పని ముట్లు ఇవ్వకపోగా చెల్లించిన డిడిలను కూడా తిరిగి వెనక్కి ఇవ్వలేని దుస్థితి నాటి ప్రభుత్వంలో ఉందన్నారు. కులవృత్తికి ఆధునికతను జోడించి పని సులభతరం చేయడంతోపాటు ఆదాయాన్ని పెంచేలా కొత్త పరికరాలను అందించాలన్నదే కూటమి ప్రభుత్వం ఆశయమన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దుకు సంబంధించి ఇప్పటికే విధివిధానాలు రూపొందించడం శుభ సూచకమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన ప్రతి హామీ అమలుకు తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బిసిలకు టిడిపి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్‌ స్పష్టం చేశారు.

'తలారి'కి రూ.14 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోకవరం



సాయం అందిస్తున్న టిడిపి నాయకులు

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అచ్చుతాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త తలారి అబ్బులును టిడిపి నాయకులు పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.14వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కోలా ఏసుబాబు, కొత్తపల్లి సత్యనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌ పిట్టా అరుణ్‌, నాయకులు ఎన్‌.నాగేశ్వరరావు, జుత్తుక నాగేశ్వరరావు, చిటికెన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామం శివారు పేకాడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం సాయంత్రం ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో పేకాటశిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గదిలో ఉన్న పెట్రోల్ బాటిల్ కిందపడి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఒక మహిళకు గాయాలయ్యాయి. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. లొల్ల గ్రామానికి చెందిన చిట్టూరి లక్ష్మీకాంతం(48). ఈమెకు ముగ్గురు సంతానం. భర్త చనిపోయి సుమారు 20 సంవత్సరాలు అవుతోంది. ఇంటి వద్ద కిరణా షాపు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంటిలోని పెట్రోలు బాటిల్ లో ఉన్న పెట్రోల్ పొరపాటున ఒలిగి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో లక్ష్మీకాంతం చీర అంటుకుని మంటలలో కాలిపోతుండగా తల్లిని చూచి కుమారులు ఇద్దరు మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేశారు. ఈ సమయంలో పెద్ద కుమారునికి, తల్లి లక్ష్మీకాంతంకు గాయాలయ్యాయి. వీరిద్దరినీ 108లో కొత్తపేట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం కోసం రాజమహేంద్రవరం డాక్టర్లు సిఫారసు చేయడంతో ఇద్దరు చికిత్స పొందుతున్నారు ఆస్పత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

అవివాహిత అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామానికి చెందిన అవివాహిత అదృశ్యం అయినట్లు ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

నిలిచిన తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలోని ఎస్సి కాలనీల్లో గత రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ఎస్సి ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటునానరు. నీటి సరఫరా ఆగిపోయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కులాయిల ద్వారా సరఫరా ఆగిపోయినా ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లస్టర్ స్కూల్స్ బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట, గండేపల్లి

క్లస్టర్ స్కూల్స్‌ను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని వేట్లపాలెం క్లస్టర్ హెచ్ఎం పి.అనురాధ తెలిపారు. శనివారం క్లస్టర్ ప్రారంభ సమావేశం వేట్లపాలెంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 117 జిఒను ప్రభుత్వం రద్దు చేసిందని, మూడు రకాల స్కూల్స్ ఏర్పాటు చేయడానికి ఆదేశాలు ఇచ్చిందన్నారు. రోల్ తక్కువ ఉన్న పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేసిందన్నారు. రోలు ఎక్కువగా ఉన్న పాఠశాలలను మోడల్ స్కూల్‌గా మార్చిందన్నారు. క్లస్టర్ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలు ఇవ్వాలన్నారు. రాబోయే ఉఏడాదిలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ జాయింట్ సెక్రటరీ కెవిఆర్.చౌదరి, క్లస్టర్ స్ట్రాంగ్ టీచర్లు ఎం.నాగరాజు, జి.చక్రవర్తి, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గండేపల్లి మండలంలో పలు ప్రాంతాల్లో క్లస్టర్ల వారీగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. గండేపల్లి క్లస్టర్ సమావేశం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలోనూ, మల్లేపల్లి క్లస్టర్ సమావేశం ఉన్నత పాఠశాలలోనూ, కె.నాయకంపల్లి క్లస్టర్ సమావేశం ఉన్నత పాఠశాలలో జరిగింది. గండేపల్లి క్లస్టర్ సమావేశంలో ఎంఇఒ కెహెచ్.నాయక్, హెచ్ఎం వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి -గోకవరం

ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వనజాకుమారి అన్నారు. శనివారం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపరింటెండెంట్, అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ వనజాకుమారి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఝాన్సీరాణి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో చోరీల కట్టడి

ప్రజాశక్తి - కాజులూరు

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని చోరీలను కట్టడి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎఎస్‌పి పాటిల్ దేవరాజ్ మనిష్ అన్నారు. శనివారం మండలంలోని కోలంక గ్రామంలో ఇటీవల జరిగిన గొలుసు చోరీ సంఘటన స్థలాలను ఆయన పరిశీలించారు. చోరీకి గురైన మహిళల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చోరీ సంఘటన జరగకుండా ముఖ్య కూడళ్ళలో సిసి కెమెరాలు ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని, అప్పటివరకు స్థానికంగా ఉన్న వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు, దాతల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కొత్తగా ఎవరు వచ్చినా వారిపై నిఘా ఉంచాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో చోరీలు అరికట్టేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ పర్యటనలో సిఐ కృష్ణచైతన్య, గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవసరం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందించే పథకాలకు రైతు విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని చేబ్రోలు, మల్లవరం గ్రామాల్లో ఆర్ఎస్‌కెలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1.34 లక్షల మంది సొంత భూమి కలిగిన రైతులు ఉన్నారని, ఇప్పటివరకు 61 వేల మంది రైతులు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

పట్టభద్రుల్లో పట్టు కోసం...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టభద్రుల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి బరిలో 35 మంది అభ్యర్థులు తలపడుతున్న విషయం విధితమే. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులతో పాటు కూటమి, రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియాతో పాటు మరో 32 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. పట్టభద్రుల భవిష్యత్తును నిర్దేశించే ఈ ఎన్నికల్లో అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించిన అధికారులు తాజాగా అపఖ్యాతి మూటకట్టుకోవటం అభ్యర్థులతో పాటు ఓటర్లను ఆందోళనకు గురి చేస్తుంది. కూటమి అభ్యర్థి నామినేషన్ మొదలుకొని ఇప్పటి వరకూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూటమి అభ్యర్థి ఓటర్లకు రవాణా ఛార్జీలు అందజేయడం, ఓటర్ల ఫోన్ నెంబర్ల జాబితా సేకరించడం వంటివి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. సోషల్‌మీడియాలో సైతం వార్తలు చక్కర్లు కొట్టాయి. అధికార యంత్రాంగం ద్వంద వైఖరికి ఇటువంటి ఉదాహరణలు దర్పణం పడుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా పునరాలోచించి నిస్పక్షపాతంగా వ్యవహరించాలని ఓటర్లు కోరుతున్నారు.

పిడిఎఫ్ అభ్యర్థికి పెరుగుతున్న ఆదరణ

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు రోజురోజుకూ పట్టభద్రుల్లో ఆదరణ పెరుగుతోంది. పలు ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందగా ముందుకొచ్చి రాఘవులు గెలుపుకోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించి విజయ కేతనం ఎగుర వేసిన చరిత్ర పిడిఎఫ్ సొంతం. ఇటీవల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గురుమూర్తి విజయఢంగా మోగించిన విషయం విధితమే. ఉపాధ్యాయ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి తమ గళం వినిపించే అభ్యర్థిని మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే గెలుపు శిఖరాలను దరిచేర్చారు. తాజాగా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ అదే పునరావృతం కానుందని విశ్లేషకులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చిన విషయం విధితమే. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. మరో వైపు ఉద్యోగులకు కనీసం ఒక్క డిఎ కూడా ఇవ్వలేదు. కొత్త పిఆర్‌సి కమిషన్‌ను సైతం వేయలేదు. దీంతో ప్రభుత్వంపై ఆయా వర్గాలు సంతృప్తికరంగా లేవు. ఈ నేపథ్యంలో పోరాట చరిత్ర కల్గిన పిడిఎఫ్ అభ్యర్థికి అన్ని వర్గాల నుంచి ఆదరణ లభిస్తోంది.

భయ పెడుతున్న బర్డ్ ఫ్లూ

బర్డ్ ఫ్లూ జిల్లా ప్రజలను భయపెడుతోంది. జిల్లాలోని పెరవలి మండలం కానురులోని పౌల్ట్రీలో కోళ్ల మృత్యువాతకు బర్డ్‌ఫ్లూ కారణమని శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాతతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సైతం అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపడుతోంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మనుషులకు సైతం వ్యాధి వ్యాపిస్తుందనే ప్రచారం ఊపందుకుంది. మరోవైపు చికెన్, గుడ్లు విక్రయాలపైనా తీవ్ర ప్రభావం పడింది. రెడ్ జోన్ పరిధిలో ఇప్పటికే చికెన్‌షాపులు మూతపడిన విషయం విధితమే. పట్టణ ప్రాంతాల్లోనూ మాంస ప్రియులు చికెన్ కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ధరలు పాతాళంలోకి చేరాయి. ఫలితంగా పౌల్ట్రీ రంగానికి మరో ఎదురు దెబ్బ తగినట్టైంది. ఇటువంటి విపత్తుల నుంచి ప్రభుత్వమే ఆదుకోవాలని పౌల్ట్రీ నిర్వహకులు కోరుకుంటున్నారు. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు క్రమ క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి వేడి గాల్పులు ఊపందుకోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. ఫిబ్రవరి రెండవ వారంలోనే ఇలా ఉంటే మే నెలలో తారాస్థాయికి చేరతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. ఉమ్మదీత, ఉక్కపోతతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా చొరవ చూపి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

గోదారి గలగలలు

ఉపాధ్యాయునితోనే బోధన సాధ్యం

విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ అబ్రహాం
క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టెక్నాలజీ ఎంత మారినా విద్యార్థులకు టీచర్ ద్వారానే బోధన సాధ్యం అని, టెక్నాలజీ టీచర్‌కు ప్రత్యామ్నాయం కాలేదని రాష్ట్ర విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహాం అన్నారు. స్థానిక లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను అయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్రహాం మాట్లాడుతూ..పాఠశాలల్లో ఎన్‌రోల్ మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. బడి ఈడు బాలబాలికలు విధిగా బడిలోనే ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బోధనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆసక్తికరమైన తరగతి గదిని రూపొందించాలన్నారు. ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్ సెషన్‌లో కమిషనర్ సూచనలు వెబెక్స్ ద్వారా విన్నారు. జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ పభుత్వ పాఠశాలలకు ఎక్కువగా పేదపిల్లలే వస్తారన్నారు. వారి అభ్యున్నతికి పాటు పడాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా క్లస్టర్‌లుగా విభజించి ఒకో క్లస్టర్‌లో కనీసం 10 పాఠశాలలు ఉండేలా చేశారన్నారు. ఇక నుంచి ఈ క్లస్టర్ సమావేశాలు ప్రతినెలా మూడవ శనివారం ఒకరోజు మాత్రమే జరుగుతాయన్నారు. ఒకవేళ మూడవ శనివారం సెలవైతే నాల్గవ శనివారం జరుగుతాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ క్లస్టర్ సమావేశాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యంత శ్రద్ధగా వీటిని నిర్వహించాలన్నారు. క్లస్టర్ సమావేశాల పరిశీలనకు నోడల్ అధికారులను నియమించామన్నారు. అజెండా ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి, కార్యాలయానికి రిపోర్ట్ పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

3వ రోజు అంగన్‌వాడీల శిక్షణ

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం హై స్కూల్లో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. వికలాంగ పిల్లల స్క్రీనింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్లో ఉన్న పిల్లల్లో అభివృద్ధి ఆటంకాలు ఉన్నవారిని, వైకల్యాలు ఉన్నవారిని ముందుగా ఏలా గుర్తించాలి, అభివృద్ధి మైలురాళ్లలో జాప్యం తెలుసుకోవడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శశికళ, విజయశాంతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - కడియం

ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కడియం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.రత్నమాధురి రోగులకు, వారి సహాయలకు, సిబ్బందికి సూచించారు. స్వచ్ఛత కార్యక్రమం, మెడికల్ క్యాంప్‌లో భాగంగా ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందికి శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వార్డుల్లో వివిధ రంగుల డస్ట్ బిన్ల గురించి, ఏ డస్ట్ బిన్లలో ఏ వ్యర్థాలు ఎలా వెయ్యాలో శానిటేషన్ సిబ్బందికి, వార్డుల్లోఉండే రోగుల సహాయకులకు వివరించారు. నర్సింగ్, పారామెడికల్, శానిటేషన్ సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. నిత్యం ఆసుపత్రిని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషుల, మహిళల హాకీ టోర్నమెంట్ శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది.కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్.భావన, అర్జున అవార్డు గ్రహీతలు ఎన్.మహమ్మద్ రియాజ్, పద్మశ్రీ ఎన్.ముఖేష్‌కుమార్, సివిల్ సర్వీసెస్ క్రీడల బోర్డు కన్వీనర్ రాజ్‌కుమార్ వర్మ పాల్గొన్నారు. డిఎస్‌ఎ క్రీడా మైదానంలోని హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ విగ్రహానికి అతిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జాతీయ పతాకాన్ని, టోర్నమెంట్ పతాకాన్ని, రాష్ట్ర పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతీయ క్రీడల బోర్డులకు ప్రాతినిధ్యం వహిస్తూ టోర్నమెంటులో పాల్గొంటున్న 44 హాకీ జట్లు మార్చ్ పాస్ట్ నిర్వహించాయి. టోర్మమెంట్‌ను ప్రారంభ సూచికగా కలెక్టర్ షాన్‌మోహన్ బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు ఆతిధ్యం ఇచ్చే అవకాశం కల్పించినందుకు సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డ్‌కు ధన్యవాదాలు తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికి స్వాగతం పలికారు. క్రీడా స్ఫూర్తితో ఈవెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. క్రీడలతో పాటు కాకినాడ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలను కూడా క్రీడాకారులందరూ తిలకించాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తొలిసారి ఈ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నామని, ఆతిధ్యం, ఆహారం వంటి అంశాలకు సంబంధించి ఏవైనా లోపాలు ఉంటే సర్దుకోవాలని కోరారు. టోర్నమెంట్ నిర్వహణలో వివిధ అంశాలను స్పాన్సర్ చేస్తూ ఆర్థిక సహకారాన్ని అందించిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు అన్నింటికి ఆయన పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరిగిన 38వ జాతీయ క్రీడలు-2025లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొట్టమొదటిసారిగా జిమ్నాస్టిక్స్ విభాగంలో బంగారు పతకం సాధించిన కాకినాడ జిల్లా క్రీడాకారిణి ఎస్‌కె.యాసిన్‌ను, కోచ్ సురేష్‌ను ఈ సందర్భంగా సత్కరించారు.



తలపడుతున్న జట్లు



ప్రారంభోపన్యాసం చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

తొలి రోజు విజేతలు

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్-2025 తొలిరోజు నిర్వహించిన పోటీల్లో హిమాచల్ ప్రదేశ్-హర్యానా జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో హర్యానా 14-0 తేడాతో హిమాచల్ ప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది.కర్ణాటక- పాండిచ్చేరి జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్లో పాండిచ్చేరి 10-1 తేడాతో కర్ణాటక రాష్ట్రంపై విజయం సాధించింది.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు శనివారం 36వ జాతీయ రహదారి భద్రత మాసో త్సవాలు-2025 ముగింపు సమావేశం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన ఆటో డ్రైవర్లు, వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రహదారి భద్రత నిరంతర ప్రక్రియని వాహన చోదకులు, పాదచారులు నిత్యం రహదారి నియమాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు తమ వాహనాన్ని నడిపేటప్పుడు రహదారి భద్రతా నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలను నియంత్రించాలని, వాహనదారులు నడిపే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన పెంపొందిం చాలన్నారు. రహదారి భద్రతలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలో భౌగో ళిక పరిస్థితులను బట్టి కాలువ గట్ల రోడ్లపై పయనించేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉదయాన్నే విపరీతమైన మంచుతో రోడ్లు ఉన్నాయని ఆ సందర్భంలో కూడా వాహనదారులు మరింత జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. కళాశాల విద్యార్థిని, విద్యార్థులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాన్ని నడపాలన్నారు. నాలుగు చక్రాల వాహనాదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ను ధరించాలని వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. ముఖ్యంగా వాహనాదారులు సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనా లు నడపడం ఎంతో ప్రమాదకరమన్నారు. అధిక వేగం రాష్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమన్నారు.అదేవిధంగా ఆటో రిక్షా లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని ఆటో డ్రైవర్లకు తెలియజేశారు. కళాశాలలో అవగాహన సదస్సులు కల్పించడంతో పాటు అర్హులైన వారికి డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయాలని సూచించారు. ప్రమాదాలు సంభవించిన వెంటనే గుర్తించి క్షతగాత్రులకు కొరకు 108 అత్యవసర వైద్య సేవలు వాహానానికి కాల్ చేయడం ప్రాథమిక చికిత్సలకు సిఫార్సు చేసి ఆదుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. వాహన దారులకు రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగిందని స్థానిక రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు.. డ్రాయింగ్ వ్యాసరచన పోటీలలో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసు, కాశి లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న రవాణాశాఖాధికారి తదితరులు



పంపిణీ చేస్తున్న నామన ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాంబాబు

నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి,- మామిడికుదురు

నామన పౌండేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకులు జడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు అన్నారు మగటపల్లిలో నామన కృష్ణవేణి జ్ఞాపకార్థం 100 మంది పేద మహిళలకు శనివారం చీరలు అందజేశారు. డాక్టర్లు నామన వినోద్, నామన శృతి ల ఆధ్వర్యంలో పేదలకు అండగా నిలవాలని సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొలిశెట్టి జయరామ్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు బొలిశెట్టి ప్రభుదాస్, సరెళ్ల సత్యనారాయణ, కుంపట్ల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రస్తుత రబీ సీజన్లో సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు సుమారు రూ.1 కోటి8 లక్షలతో డ్రెయినేజీలపై అడ్డుకట్టలు వేసి ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీటిని సరఫరా చేయడం, కాలువల గేట్ల షట్టర్లు మరమ్మతులు, కాలువ గండ్లు పూడ్చటం వంటివి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు జల వనరులు డ్రెయినేజీ విభాగ ఇంజినీర్లు వ్యవసాయ శాఖ అధికా రులతో సంయుక్తంగా సాగునీటి ఎద్దడిని అధిగమించే విధి విధానాలపై సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్లో 1,65,000 ఎకరాలు సాగులో ఉందని, ఈ యొక్క సీజన్ మార్చి నెలాఖరులో గోదావరి నది ఎగువ భాగంలో నీటి ప్రవాహం తగ్గి సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్ప న్నమయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టా మని తెలిపారు. సాగు నీటి ఎద్దడిని అధిగమించేందుకు 70 ప్రాంతాలను గుర్తించి డ్రెయినేజీలలో 41 పనులు కొరకు రూ.92 లక్షల అంచనాలతో డ్రైనేజీ విభాగం ద్వారా ప్రతిపా దనలను సమగ్ర వివరాలతో రూపొందించామన్నారు. త్వరలో అంచ నాలు రూపొందించి పనులకు పరిపాలన ఆమోదం నిధులు మంజూరు చేస్తామన్నారు. జలవనరుల విభాగం ద్వారా కాలువ గేట్ల షట్టర్లు మరమ్మత్తు లు గండ్లు పూడ్చడం కొరకు 11 పనులను రూ.16 లక్షలతో నిర్వహిం చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ యొక్క పనులను వ్య వసాయ శాఖ డ్రైనేజీ జలవనరుల శాఖ పర్యవేక్షణలో నీటి వినియోగదారుల సంఘాల కు నామినేషన్ ప్రాతిపదికన అప్పగించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వారాబంది విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తూ సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేయాలన్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలలో వరి నాట్లు ముందుగా వే యడం వల్ల పంట కోతకు ముందుగానే వస్తుందని ఆ నియోజకవర్గాల్లో పెద్దగా నీటి ఎద్దటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. తూర్పు డెల్టాలో పంట కోత ముందుగా వస్తుందన్నారు. ఆ యొక్క నీటిని సెంట్రల్ డెల్టాకు మళ్లించాలని ఇంజనీర్లకు సూచించారు. ఐ.పోలవరం మండలంలో 33, కాట్రేనికోనలో 4, అల్లవరంలో 5, ఉప్పలగుప్తంలో 4 మల్కిపు రంలో 3, సఖినేటిపల్లి లో 3, రాజోలు 3, మామిడికుదురులో 3, కొత్తపేటలో 2, కె.గంగవరంలో 3, కాజులూరులో 1, రాయవరంలో 1 ఆలమూరులో 2, కపిలేశ్వర పురంలో 1, రామచంద్రపురం మండలంలో 1 డ్రెయి నేజీ పనులను ప్రతిపాదిం చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో జెసి టి.నిషాంతి, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, డ్రెయినేజీ విభాగం కార్య నిర్వా హక ఇంజినీర్ ఎంవివి.కిషోర్, జల వనరులశాఖ డివిజన ల్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.